# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగలను జరుపుకుంటూ వాటి గొప్పతనాన్ని భావితరాలకు తెలియజేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- రాష్ట్రంలోని గ్రామాలన్నీ సంక్రాంతి శోభ సంతరించుకున్నాయి.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించిన సుస్థిర వ్యవసాయంతో లాభాలు ఆర్జిస్తున్నామని రైతులు తెలిపారు.
- అండర్-19 క్రికెట్ ప్రపంచ కప్ తొలి మ్యాచ్ జింబాబ్వే వేదికగా భారత్, అమెరికా జట్ల మధ్య జరుగుతోంది.

======================

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పంటలు చేతికొచ్చి రైతులు ఆనందంగా జరుపుకునే సంక్రాంతి పండుగ సమయమిదని.. ఇటువంటి రోజుల్లో పెద్దలను తలచుకోవడం మన సంప్రదాయంగా వస్తోందన్నారు. అలాగే ప్రకృతిని కూడా ఆరాధించడం మన సంస్కృతి అని చెబుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగలను తప్పనిసరిగా జరుపుకుని భావితరాలకు వాటి గొప్పతనాన్ని తెలియజేయాలన్నారు. మూడు రోజుల పాటు సంక్రాంతి పండుగ వేడుకులను కుటుంబంతో కలిసి జరుపుకునేందుకు తిరుపతి జిల్లా నారావారిపల్లికి వచ్చిన ముఖ్యమంత్రి ఈ మధ్యాహ్నం పాత్రికేయుల సమావేశం నిర్వహించి పలు విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...

(వాయిస్ 20 సెకన్లు)

అదే విధంగా 2047లోగా స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేస్తున్నామని, నిర్దిష్టమైన లక్ష్యాల మేరకు పని చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరి జీవన ప్రమాణాలు, ఆదాయం పెరగాలని అందరూ ఆరోగ్యంగా.. ఆనందంగా ఉండాలని ఆదిశగా ప్రభుత్వం పని చేస్తోందని చంద్రబాబు నాయుడు వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

రాష్ట్రంలోని గ్రామాలు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. పండుగ వాతావరణంతో పల్లెల్లో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. అందమైన రంగవల్లులు, ఇంటింటా బంధుమిత్రుల కోలాహలంతో గ్రామీణ ప్రాంతాలన్నీ కళకళలాడుతున్నాయి. దేవాలయాలన్నీ భక్తుల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. పల్లెల్లో రైతులు తమకు తోడుగా ఉన్న పశుసంపదకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలతో పాటూ.. స్వస్థాలకు తిరిగి వచ్చిన స్నేహితుల కలయికలతో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. సూర్యమాన పద్ధతిని అనుసరించి జరుపుకునే పండుగ సంక్రాంతి. ఈ రోజుతో దక్షిణ దిశలో ప్రయాణించిన సూర్యుడు ఉత్తర దిశగా కదలడం ప్రారంభిస్తాడు. అందుకే దీనిని ఉత్తరాయణ పుణ్యకాలంగా పేర్కొంటారు. సూర్యుడి దిశ మార్పుతో పాటు వాతావరణంలోనూ మార్పులు కనిపిస్తాయి. చలి తీవ్రత క్రమంగా తగ్గి, పంటలకు అనుకూలమైన కాలం మొదలవుతుందని రైతులు భావిస్తారు. ఈ కారణాల వల్లే సంక్రాంతిని అనాదిగా పెద్దల పండుగగా.. ప్రధాన పండుగగా గౌరవిస్తారు.

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 130వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 23వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

విరామం

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ రైతులను ఉద్దేశించి సుస్థిర వ్యవసాయంపై మాట్లాడం ఎంతో సంతోషంగా ఉందని నంద్యాల జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రకృతి వ్యవసాయంలో వచ్చే దిగుబడులు, వాటి ప్రయోజనాలు గురించి ప్రధానమంత్రి తెలియజేయడం శుభ పరిణామమని, ఆయన సూచనలు.. సలహాలను తప్పకుండా పాటిస్తామని చెప్పారు. ప్రకృతి వ్యవసాయంలో ముఖ్యంగా కూరగాయలు పండించడం వల్ల అధిక లాభాలు పొందుతున్నామని వాడాల గ్రామానికి చెందిన శేషన్న ఆకాశవాణికి వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

=====================

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత, సంఘు సంస్కర్త త్రిపురనేని రామస్వామి చౌదరి జయంతిని పురస్కరించుకొని ఈరోజు శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో అధనపు ఎస్పీ పి. శ్రీనివాసరావు త్రిపురనేని చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్రిపురనేని రామస్వామి చౌదరి సమాజంలో అంధవిశ్వాసాలు, మూఢాచారాలు, కుల వివక్ష, అసమానతలపై నిర్భయంగా పోరాడారని చెప్పారు. మానవతా విలువలు, తర్కబద్ధమైన ఆలోచనలు ప్రజల్లో వ్యాప్తి చెందాలనే దృఢ సంకల్పంతో తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు.

=====================

ఐసీసీ అండర్-19 పురుషుల క్రికెట్ ప్రపంచ కప్ ఈరోజు ప్రారంభమయ్యింది. జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఈ టోర్నమెంట్ లో మొత్తం 41 మ్యాచ్‌లు జరగనున్నాయి. తొలిమ్యాచ్ జింబాబ్వేలోని బులవాయో

వేదికగా భారత్, అమెరికా జట్ల మధ్య జరుగుతోంది. టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. భారత బౌలర్ల ధాటికి అమెరికా 35.2 ఓవర్లలో 107 పరుగులకే ఆలౌట్ అయ్యింది. భారత బౌలర్లలో హేనిల్ పటేల్ 5 వికెట్ల ప్రదర్శనతో అద్భుతంగా రాణించాడు. 108 పరుగుల స్వల్ప లక్ష్య చేధన ప్రారంభించిన భారత్ 4 ఓవర్లు పూర్తయ్యేసరికి ఒక వికెట్ నష్టపోయి 21 పరుగులు చేసింది. తరువాత వెలుతురు లేమి కారణంగా మ్యాచ్ కు అంతరాయం ఏర్పడింది. విజయానికి ఇంకా భారత్ 87 పరుగులు చేయాల్సి ఉంది. ఈరోజు ప్రారంభమైన అండర్-19 ప్రపంచ కప్ ఫిబ్రవరి 6న ఫైనల్‌తో ముగుస్తుంది. మొత్తం 16 జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయి.

======================

వాహనదారుల ప్రయాణ సౌలభ్యం దృష్ట్యా విజయవాడ వెస్ట్ బైపాస్ రహదారిని అధికారులు ఈరోజు అందుబాటులోకి తీసుకొచ్చారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజా నుంచి కృష్ణా జిల్లా పెద అవుటుపల్లి వరకు నిర్మించిన ఈ రహదారిని అధికారులు ఒకవైపు అందుబాటులోకి తెచ్చి వాహనాలను అనుమతించారు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి రహదారిని ప్రారంభించారు. వచ్చే మార్చి నాటికి మరో వైపు రహదారిని కూడా అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. చెన్నై, గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు ఇకపై కాజా టోల్‌గేట్ దాటిన తర్వాత వెస్ట్ బైపాస్‌లోకి వచ్చి గొల్లపూడి మీదుగా చిన్న అవుటపల్లి వరకు వెళ్లి అక్కడ ఏలూరు వైపు హైవేలోకి ప్రవేశించవచ్చు. అలాగే గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు ఈ బైపాస్‌లో గొల్లపూడి వద్ద విజయవాడ - హైదరాబాద్ హైవేలోకి ప్రవేశించి హైదరాబాద్ వైపు వెళ్లవచ్చు.

======================
======================